

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప : జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించను న్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని కోరారు. 14న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఉం టుం దన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 2, రాజంపేటలో 2, రాయచోటిలో 4, బద్వే ల్లో 2, లక్కిరెడ్డి పల్లి, రైల్వే కోడూరు, నందలూరు, మైదుకూరు, జమ్మల మడుగు, పులివెందుల, కమలాపురంలలో ఒక్కొక్క బెంచి ఏర్పాటు చేసినట్లు తెలి పారు. రాజం పేట మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులు కడప నాలుగవ అద నపు జిల్లా కోర్టు బెంచ్‌లో, నందలూరు కోర్టుకు సంబంధించిన కేసులు కడప రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెంచ్‌లో, ప్రొద్దుటూరు సీని యర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించిన కేసులు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు కడప బెంచ్‌లో నిర్వహిస్తారన్నారు.

గండికోటకు జలకళ

తొలిసారి 25.5 టిఎంసిలు చేరిక



కృష్ణాజలాలతో కళకళలాడుతుతున్న గండికోట జలాశయం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గండికోట జలాశయం జలకళను సంతరించుకుంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈ ఏడాది ఆగస్టు 10న కర్నూలు జిల్లాలోని అవుకు రిజర్వాయర్ నుంచి 10,500 క్యూసెక్కులను గండికోట జలాశయానికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ రెండు సార్లు పూర్తి స్థాయిలో నిండిన నేపథ్యంలో నీటిపారుదలశాఖ గండికోట రిజర్వాయర్‌కు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయానికి 32 రోజుల వ్యవధిలోనే 25.5 టిఎంసిల మేర పూర్తి స్థాయిలో నిల్వ చేయడం గమనార్హం. 2020లో వైసిపి సర్కారు హయాంలో 26 టిఎంసిల మేరకు నిల్వ చేసిన సంగతి తెలిసిందే. గండికోట రిజర్వాయర్ పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకుంటున్న నేపథ్యంలో మూడ్రోజుల ముందుగానే పెన్నా పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను పెన్నానదీ తీరానికి రాకుండా చూడాలని నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం అప్రమత్తం చేసింది. గండికోట పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకున్న నేపథ్యంలో గండికోట జలాశయం నుంచి పైడిపాలెంకు 1000 క్యూసెక్కులు, సర్వరాయసాగర్‌కు 900 క్యూసెక్కులు, జికెఎల్ఐ పైప్‌లైన్ల ద్వారా 10 టిఎంసిల నిల్వ సామర్థ్యం కలిగిన చిత్రావతి రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. చిత్రావతికి 1500 క్యూసెక్కుల మేర తరలిస్తున్నారు. ఐదు టిఎంసిలను నిల్వ చేయడానికి జిల్లా నీటిపారుదలశాఖ సిద్ధమైనట్లు తెలుస్తోంది. మైలవరం రిజర్వాయర్‌కు సుమారు 2,500 క్యూసెక్కులను తరలిస్తోంది. మైలవరం రిజర్వాయర్ నుంచి 3,000 క్యూసెక్కుల మేర పెన్నానదికి నీటిని విడుదల చేస్తోంది. పెన్నానది పరవళ్లు తొక్కుతూ సోమశిల దిశగా సాగిపోతోంది.

బాధితులకు అండగా మహిళా కమిషన్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి



మీడియాతో మాట్లాడుతున్న గజ్జల వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో మహిళా సాధికారత, మహిళల రక్షణ, మహిళల భద్రత కోసం మహిళా కమిషన్ ఎల్లవేళలా పనిచేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బిగెస్ట్ హౌస్‌లో ఆమె పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రీయ 7వ 'పోషణ్ మా' కార్యక్రమం జైళ్లల్లో నిర్వహిస్తున్నారని చెప్పారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, యువతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకున్నట్లయితేఆరోగ్యవంతమైన బిడ్డను జన్మనిచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రాయలసీమ జిల్లాలోని రెండు జిల్లాల్లోనూ 'పోషణ్ మా' కార్యక్రమం చేయడం చేపట్టామన్నారు. ఇటీవలే కర్నూలు జిల్లాలోనూ పోషణ్ మా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జైలులో ఉన్న మహిళా ఖైదీలు ఎటువంటి సౌకర్యాలు పొందుతున్నారు, వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందుతోందా, లేదా, పోషకాహారాల విలువల గురించి, పోషకాహార ఆవశ్యకత గురించి తెలియజేస్తామన్నారు. జైలులో హెర్బల్ ప్లాంట్స్ తులసి, నిమ్మ, కలబంద, ఉసిరి, వేప మొక్కలు నాటడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించిన వారమవుతామని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని మూడు చోట్ల పోషణ్ మా కార్యక్రమం కర్నూలు, కడప, రాజమండ్రి సబ్ జైల్లో నిర్వహిస్తున్నారు. సమాజంలో మహిళకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి మహిళను వారి సొంత బిడ్డ లాగా చూసినప్పుడే మన ఇంట్లో బిడ్డలు కూడా క్షేమంగా ఉంటారని అన్నారు. జిల్లాలో మహిళా ఉద్యోగులను ఒకచోట పిలిపించి అందరికీ కూడా అవగాహన చేస్తూ పోస్ట్ యాక్ట్ పై కూడా అవగాహన కల్పించేందుకు మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందని అన్నారు..

తెలుసుకోవాలనే తపన అలవర్చుకోవాలి

- కష్టానికి ప్రత్యామ్నాయం లేదు
- ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో కలెక్టర్ శివశంకర్ లోతేటి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

తెలుసుకోవాలనే తపన కలిగి, మారుతున్న కాలమాన పరిస్థితులకు తగ్గట్టు తనను తాను మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నవారు జీవితంలో రాణిస్తారని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఉద్బోధించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 75 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు గుర్తుగా కళాశాల ద్వారం వద్ద ఏర్పాటు చేసిన 'పైలాన్' ను కలెక్టర్ శివశంకర్ లోతేటి, కడప ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టరు శివశంకర్ లో తేటి మాట్లాడుతూ మనం ఏ స్థాయిలో ఉన్నా మూలాలు మరచిపోకూడదనే విషయాన్ని ఈ కళాశాల అలుమ్ని గుర్తుచేస్తోందన్నారు. కళాశాల లోగోలోని ట్యాగ్‌లైన్ 'విద్యయా అమృత వర్షితే' అనే మాటలు ఆకట్టుకున్నాయని చెప్పారు. ప్రస్తుతం అందరూ ఇంజినీరింగు మెడికల్ కోర్సుల్లో చేరిపోతున్నారని, తాము మాత్రమే డిగ్రీ చదువుతున్నామని మిమ్మల్ని మీరు తగ్గించుకోవద్దని, ఎంతో మంది ఐఎఎస్‌లు, ఐపీఎస్ లు డిగ్రీతో వచ్చిన వారేనని గుర్తుచేశారు. యువత ఎప్పుడూ ఒక పని పూర్తవ్వగానే ఇంకోపనిలోకి ప్రవేశించడం, థామస్ అల్వా ఎడిసన్ బల్బ్ కనుగునే ప్రయోగంలో అనేక ప్రయత్నాలు తప్పినా మళ్లీ ప్రయత్నించి విజేతగా నిలవడం యువత గుర్తించి పట్టువదలని తత్వం అలవర్చు కోవాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు తాము చదివిన కళాశాల అభివృద్ధి కృషి చేయడం ప్రశంసనీయమని వారందరిని అభినందించారు. ఈ కళాశాల పూర్వపు విద్యార్థిని, ప్రస్తుత కడప శాసన సభ్యురాలు మాధవి మాట్లాడుతూ 1992 సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఇక్కడ చదివానని ఇక్కడి జ్ఞాపకాలు నిత్యం తనతో ఉన్నాయన్నారు. సమాజ వ్యతిరేక విధానాలు అవలంభించే వారిపై తిరుగుబాటు చేసే నైజం ఆ రోజుల్లోనే తనలో మొదలైందన్నారు. విద్యార్థిగా ప్రతి పోటీలో భాగస్వామ్యం వహించి విజయం అందుకొన్నారన్నారు. విద్యార్థి దశలో విజేతగా ఉంటామా లేదా అనేది ముఖ్యం కాదని ప్రయత్నం ముఖ్యమని అదే విజయతీరాలను చేరుస్తుందని విద్యార్థులకు ఉద్బోధించారు. 75 ఏళ్ల ఉత్సవాల నిర్వహణలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరూ అభినందనీయులని కితాబిచ్చారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ 1948లో ఏర్పాటైన ఆర్ట్స్ కళాశాల నేటి వరకు ఎదిగిన క్రమాన్ని వివరించారు. రాష్ట్రంలో 170 డిగ్రీ కళాశాలలలో జాతీయ స్థాయి సంస్థలిచ్చే ర్యాంకుల్లోనూ, ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, జడ్జిలు, ఎందరో అధికారులను ప్రజాప్రతినిధులను అందించి మేటిగా తమ కళాశాల నిలిచిందన్నారు. మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో 'తెలుగు భాష ప్రాశస్త్యం పై 'అవధాన సాహిత్యంలో సొగసులు' అనే అంశంపై ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి ప్రసంగించగా, తెలుగు భాష- ప్రాశస్త్యం' పై డా. సాయి ప్రసాద్ ప్రసంగించారు. తొలుత కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన గావించి, ప్రార్థన గీతంతో ప్రారంభించారు. తదనంతరం కళావాల సావనీరు ఆవిష్కరించారు.చివరిగా సిల్వర్ జూబ్లి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఆచార్య రాజశేఖర్ రెడ్డి, లయన్ చిన్నపరెడ్డి, ఆలుమ్ని పూర్వ విద్యార్థులు శాంతి స్వరూప్ బట్నాగర్ అవార్డీ ఆచార్య బి.ఎల్ఎస్ ప్రకాశరావు, మాజీ వీసీ ఆచార్య రహమతుల్లా, ఆచార్య చిన్నపరెడ్డి, డాక్టర్ ఎన్. సత్యనారాయణ, పి. రామచద్రన్, కందుల విద్యాసంస్థల అధిపతి కందుల రాజేశ్వరి, సజ్జల జనార్ధన్రెడ్డిలను ఘనంగా సత్కరించారు. కళాశాల ఆలుమ్ని కార్యదర్శి కె.శివరాం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆలుమ్ని ప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కీరుపల్లెలో అన్నదానం


ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని 12వ డివిజన్ పక్కీరుపల్లె యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డివిజన్ నాయకులు మజ్జారీ జయరాం ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తి శ్రద్ధలతో యూత్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి గ్రామంలో యువత ఇలానే ముందుకొచ్చి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం వినాయక లడ్డు యాలం రూ.40 వేలతో ఫక్కీరుపల్లెలోని పేయ్యాల వారి కుటుంబ సభ్యులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిలు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, జయరాం స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

1989 డిఎస్‌సి వారికి ఉద్యోగోన్నత కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో 1989 డిఎస్‌సి వారు దాదాపుగా ఉద్యోగోన్నతులు పూర్తికావచ్చిన, సోషల్ అధ్యాపకులు జాబితాలో ఉన్న కోర్టు కేసుల వల్ల ప్రమోషన్ పొంద లేకపోయారని, వీరికి ఉద్యోగోన్నతలు కల్పించాలని ఎస్‌టియు నాయకులు కోరారు. శుక్రవారం డిఇఒ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విరమణ వయసు దగ్గరపడుతున్నందున సోషియల్ సబ్జెక్టులో ప్రమోషన్ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షులు ఇలియాస్ బాష, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. సురేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. బాల గంగిరెడ్డి పాల్గొన్నారు.

గణితం, కంప్యూటర్ విద్యలో ప్రోత్సాహం

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న అభిరామ్

రాచమడుగు అభిరామ్, మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్ అనే కార్యక్రమంలో భాగంగా గణిత శాస్త్రం, కంప్యూటర్ విద్య విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంలో మున్సిపల్ హై స్కూల్ (మెయిన్) నుంచి 25 మంది 6వతరగతి బాలిక విద్యార్థులను ఎంపిక చేసుకుని ఆర్తి హెూమ్, చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో ఆర్తి స్కూల్‌లో తరగతులు నిర్వహిస్తామని అభిరామ్ తెలిపారు.శుక్రవారం ఆర్తి హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ హై స్కూల్ (మెయిన్) ప్రధానోపాధ్యాయులు నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమకాలీన జీవనంలో గణిత శాస్త్రం, కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్ ఇటువంటి గొప్ప కార్యాన్ని నిర్వహించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆర్తి స్కూల్ ప్రధానోపాధ్యాయులు చిన్న ఓబులేసు, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) రహమతుల్లా పాల్గొన్నారు.

'ఏచూరి' చరిత్ర అజరామరం



బద్వేలు : సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



కడప : సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చరిత్ర అజరామరం అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం బద్వేలు రూరల్ కమిటీ కార్యదర్శి దాసరి వెంకటేష్ ఆధ్వర్యంలో ఏచూరికి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974 నుండి 2024 వరకు 50 సంవత్సరాలుపైగా యావత్ భారతదేశంలో విద్యార్థి దశ నుండి మరణించేవరకు జరిగిన ప్రజా ఉద్యమాలలో నిత్యం కలయతిరిగి, ప్రజల సమస్యలు అధ్యయనం చేసి, ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి, ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రభుత్వాలను నిలదీసిన ధీశాలి కామ్రేడ్ ఏచూరి అని కొనియాడారు. దేశంలోని విద్యార్థులను అంత ర్జాతీయ మేధావులుగా తీర్చిదిద్దుతున్న జెఎన్‌యు విద్యార్థి సంఘాల ఎన్ని కల్లో మూడు దఫాలు యూనివర్సిటీ అధ్యక్షులుగా ఎన్నికై హ్యాంట్రిక్ సాధిం చారని , ఆయనతో కలిసి పనిచేసిన జైపాల్ రెడ్డి, చిదంబరం, అరుణ్ జెట్లీ, లాంటివారు కేంద్ర మంత్రులంగానూ, ప్రచండ లాంటి విద్యార్థులు నేపాల్ దేశ అధ్యక్షులుగాను పనిచేశారన్నారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని వ్యతి రేకించి, జెఎన్‌యు విద్యార్థులతో భారీ ర్యాలీగా ఆమె నివాసాన్ని ముట్టడించి, తప్పులను ఆమె ముందే చదివి వినిపించి, ప్రజాస్వామ్య హక్కుల హరణ పై దేశ ప్రధానిని ఎండగట్టిన ధైర్యవంతుడు ఏచూరి అన్నారు. ఆయన జీవితం విద్యార్థి ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్టసభలలో వారు లేవనెత్తిన ప్రజా సమస్యలు, ప్రభుత్వాల బలహీనతలు, దేశ సమైక్యత, సమగ్రతకు ముప్పు తెచ్చే రాజకీయ పరిణామాల్లో ఏచూరి చరిత్ర అజరామరం అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, సిపిఎం బద్వేలు రూరల్ కమిటీ సభ్యులు పి.చాద్ బాషా, వెంకటరమణ, దుర్గమ్మ, పుష్పమ్మ, జి.జయరాజు, ఎన్.రామ్మోహన్ , రవిచంద్ర, ఎన్.ఓబులేసు పాల్గొన్నారు.

పోరాటాలు స్ఫూర్తిదాయకం : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని, ఆయన పోరా టాలు యువతకు, భావి తరాలకు స్ఫూర్తిదాయకమని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సీతారాం ఏచూరికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప జిల్లా కార్యా లయంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ కోసం జాతీయస్థాయిలో ఢిల్లీ వేదికగా ఉద్యమాన్ని నిర్మించిన వ్యక్తి అన్నారు. ఆయన కడపకు వచ్చిన సందర్భం ముఖ్యంగా కడప ఉక్కు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఎన్ఆర్‌సి ఉద్యమంలో కడపలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యార్థి, యువజన, శ్రామిక మహిళ, తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలబడి నిర్బంధాలను లెక్కచేయకుండా నమ్మిన సిద్ధాంతాల కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్ నాయకులు ఉదయ్, రఘు పాల్గొన్నారు.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది : ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కమ్యూనిస్ట్ దిగ్గజం, సిపిఎం జనరల్ సెక్రటరీ, రాజ్యసభలో ఒకప్పటి తన సహచరులు, మిత్రులు సీతారాం ఏచూరి మృతి అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య పేర్కొన్నారు. సీతారాం మృతితో దేశం నిబద్ధత గల ఓ గొప్ప రాజకీయ నాయకుణ్ణి, పీడిత ప్రజల తరపున ఉద్యమాలు చేసే పోరాట యోధుణ్ణి కోల్పోయింది. సీతారాం ఏచూరి ఓ అరుదైన అద్భుత మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. నిరంతరం పేద, కార్మిక వర్గాల శ్రేయస్సు కోసం ఆలోచించిన నాయకుడు అని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీకి ఫ్లోర్ లీడర్‌గా ఉండగా, ఆయన సిపిఎంకు ప్రాతినిధ్యం వహించి ఫ్లోర్ లీడర్‌గా ఉండేవారని, వివిధ అంశాలపై మేము ఇరువురం సమన్వయంతో పని చేశామని చెప్పారు. సీతారాం ఏచూరి మరణం దేశానికి, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. సీతారాం ఏచూరి గారి మృతికి సంతాపం తెలుపుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రభుత్వ రంగ సంస్థల ఆప్తమిత్రుడు : ఎల్ఐసి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమానికి అందించిన మద్దతు సహకారం అమూల్యమైందని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి అన్నారు. శుక్రవారం యూనియన్ కార్యాలయం ఆవరణలో డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, చంద్రపాల్, అమీనా పర్వీన్, వసుప్రద, కెసిఎస్ రాజు, అయ్యవారు రెడ్డి, రఘు, అప్పయ్య, చిన్నయ్య, గౌస్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏచూరి మృతి బాధాకరం : తులసిరెడ్డి

వేంపల్లె : సిపిఎం నేత సీతారాం ఏచూరి మృతి చెందడం చాలా బాధాకరమని ఎపిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి చెప్పారు. శుక్రవారం వేంపల్లెలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజకీయ అజాత శత్రువు, సిద్ధాంత బద్ధుడని చెప్పారు. ఉద్యమాలే ఊపిరిగా ఏచూరి నడవడం జరిగిందని చెప్పారు.

ఖాజీపేట : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి అత్యంత బాధాకరం, ఆయన సేవలు మరువలేనివని అపార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. శుక్రవారం ఖాజీపేటలో పార్టీ బాధ్యులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతాల వ్యాప్తికి అలుపెరగని పోరాటం చేసారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు లడ్డు బాషా, సిఐటియు ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు పుల్లూరు నారాయణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, నూరుబాష , పుల్లూరు మహేష్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అభినయ్ పాల్గొన్నారు.

కాశినాయన : సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటు అని పోరుమామిళ్ల సిపిఎం మండల కార్యదర్శి ఎన్ భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. పోరుమామిళ్ల అంబేద్కర్ భవనంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి సిఐటియు, ఐద్వా, రైతు, ఆటో రంగానికి చెందిన వారు నివాళులరిం పచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతతత్వాన్ని పార్ల మెంట్‌లో ధీటుగా ఎదుర్కొన్న ఏచూరి భారతదేశ ప్రజాస్వామ్య లౌకిక గణ తంత్ర సోషలిస్టు రాజ్యాంగాన్ని కాపాడటానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు షేక్ గౌసియా బేగం బీబీ ఫాతిమా సిఐటియు నాయకులు చిన్నయ్య, గురయ్యా, జాకోబ్, మాలయాద్రి, రవి, రత్నమయ్య, రమేష్, రమణ, జయమ్మ, విజయ, నాగమణి, గురమ్మ, మరియమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : సిపిఎం మండల కార్యదర్శి నరసయ్య ఆధ్వర్యంలో సీతారాం చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు . కార్యక్రమంలో రాము పెంచలయ్య, వెంకటేశు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు



కడప : ఎల్ఐసి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు



పోరుమామిళ్ల : సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాగు, సాగు నీరందించడమే లక్ష్యం : 'పుత్తా'

ప్రజాశక్తి- కమలాపురం టౌన్ : వీరపునాయనపల్లె మండలం అడవి చెర్లోపల్లె వద్ద గాలేరు-నగరి ప్రధాన కాల్వ నుంచి ప్రత్యేక కాల్వ ద్వారా మోగమూరు వంక గుండా పాపాఘ్ని నదికి నీరు తీసుకొచ్చి సమీప గ్రామాల్లోని ప్రజలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పనులను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తాన రసిం హారెడ్డితో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాల్వల ద్వారా వంకలు, చెరువులను నింపి వ్యవసా యానికి సమృద్ధిగా నీటిని అందించాలనే ఉద్దేశంతో పనులు ప్రారంభి ంచామని చెప్పారు. కమలాపురం నియోజకవర్గం అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే అడిగిన వెంటనే రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టా మని పేర్కొన్నారు. అడిగిన వెంటనే నిధులు విడుల చేసిన రాష్ట్ర జలవ నరుల శాఖ మంత్రి, ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజలు వ్యక్తి, పరిసరాల శుభ్రత పాటించాలని అప్పుడే వ్యాధులు దరి చేరవని అదనపు కమిషనర్ కె. రాకేష్ చంద్రం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఆయన చెన్నూరు బస్టాండ్, అల్మాస్ పేట, నకాష్ ప్రాంతాలను సందర్శించారు. చెన్నూరు బస్టాండ్‌లో పారిశుధ్య కార్మికుల హాజరు పత్రాలను పరిశీలించి, వీధుల్లో చెత్త పాయింట్లను రోజూ శుభ్రం చేయాలని ఆదేశించారు. అల్మాస్ పేటలో పెద్ద కాలువల పూడికలను తొలగించి, వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకాష్ ప్రాంతంలో చెత్త పాం యింట్లు, మురుగుకాలువలను పరిశీలించి, వ్యర్థాలను ఎప్పటికప్పుడూ ఎత్తివేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. పునర్ వినియోగం, వ్యర్థాల సరైన నిర్వహణ ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుందని వివరించారు.

కానిస్టేబుళ్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి కడప అర్బన్

సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు అక్టోబర్ ఐదు నుంచి 14 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హీ సేవా : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఈ నెల 17 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు 'స్వచ్ఛతా హీ సేవా' పేరుతో కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ నుంచిరెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం 15 రోజులపాటు జరగనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు ఎలాంటి అలసత్వం లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత పై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, మొదలగు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు,విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించి పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హి సేవ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని అన్నారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యాన వనాలు- పర్యాటక కేంద్రాల సుందరీకరణ తదితర పనులు చేపట్టాలని ఆదేశించారు. మిషన్ లైఫ్ క్యాంపెన్‌లో భాగంగా సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఆహార అలవాట్లు, ఆరోగ్యం, ఈ వేస్ట్‌ల పై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు,చెత్త కుప్పలు, బోరు బావుల చుట్టుపక్కల మొదలగు ప్రదేశాల్లో మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఎంపిడిఒలు, ఆర్ డబ్ల్యుఎస్ ఎఇల, విస్తరణాధికారులు, సంబంధిత అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛతా హి సేవ నిర్వహణలో ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. సఫాయి మిత్రా సురక్ష కింద సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడం, ఆరోగ్య సదస్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా చెరువులు, కుంటల కాలు వల వద్ద వ్యర్థపదార్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను, ఇతర శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు.

అర్హతగల డ్రైవర్లు బస్సులను నడపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

డ్రైవింగ్ లైసెన్స్, వాహన కండీషన్‌పై అవగాహన ఉన్న వారు మాత్రమే స్కూల్ బస్సులు నడపాలని ఎంఇఒ శివప్రసాద్ సూచించారు. మండలంలో వాహనాలు కలిగి ఉన్న ప్రయివేట్ పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల పర్మిట్లను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా అలాగే మద్యం సేవించి వాహనం నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపినా, వాహనం యొక్క కండీషన్ పై సరిఅయిన అవగాహన లేకుండా సదరు పాఠశాలపై కూడా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఖర్చులు తగ్గుతాయనే ఆలోచనతో పరిమితికి మించి ఆటోలో తమ పిల్లలను ఎక్కించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను తీసుకెళ్లడం ప్రమాదమని డ్రైవర్లనుద్దేశించి పేర్కొన్నారు. అలా చేస్తే ఫొటో తీసి ఆర్‌టిఒ కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఆటో డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సు కూడా రద్దుచేసే అవకాశం ఉందని ఎంఇఒ హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నిర్మూలన

ప్రజాశక్తి - మైదుకూరు

సరైన సమయంలో పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనతను నిర్మూలించవచ్చని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రశాంతి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సూచించారు. మండలంలోని కృష్ణాపురం సచివాలయం పరిధి భూమాయపల్లి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, అనూష, రాజేశ్వరి, సావిత్రమ్మ, అనిత, పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు, చీరలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


సరుకులు పంపిణీ చేస్తున్న అయూబ్ ఖాన్

మన ప్రజా సేవ సమితి ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. విజయవాడ సిటీ, సింగ్ నగర్, ఫైపుల వీధిలో వరద బాధితులకు శుక్రవారం ప్రొద్దుటూరు పట్టణం నుండి విజయవాడ వరద బాధితుల కోసం మన ప్రజా సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, సంఘ సేవ న్యూస్ ఛానల్ అధినేత ఎండి అయూబ్‌ఖాన్ సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. వరదలతో చాలా దుర్భర స్థితి నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న 100 కుటుంబాలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేశా మన్నారు. వరద బాధితులకు ఎంత చేసినా తక్కువేనన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సహాయం అందించి వరద నష్టాన్ని పూడ్చాలన్నారు. కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి ప్రధాన కార్యదర్శి హరి యాదవ్, ఉపాధ్యక్షులు నరసింహ, యువత ప్రధాన కార్యదర్శి యూసుఫ్, సహాయ కార్యదర్శి ఫరాన్, రఫి, మహిళ అధ్యక్షురాలు సైరాబాను, మెహమూదా పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి లక్ష్మణ్ నాయక్ ఆదేశించారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రక్త పరక్ష నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు ముబీన్, జోనల్ ఆరోగ్య విస్తరణ అధికారి నిత్యపూజయ్య.. మండల ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, పర్యవేక్షకులు శోభన్‌బాబు, కృష్ణప్రియ, ఆశ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, విజయభాస్కర్. ల్యాబ్ టెక్నీషియన్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

17 నుంచి నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాలు

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాలను ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎంపిడిఒ సంపతి దివిజ పేర్కొన్నారు. ఆ మేరకు గోడ పత్రాలను శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమాల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో రాజారాం, దేవస్థానం మాజీ చైర్మన్ జివి రమణ, పోతిరెడ్డి శివ, మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సిహెచ్ఒ వెంకట రత్నం, ఎంపిహెచ్ఇఒ ఫకృద్దీన్, చక్రపాణి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తమ్ముడ్ని కడతేర్చిన అన్న

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


మృతి చెందిన బాబాఫకృద్దీన్

మండల పరిధిలోని రాయలాపురం గ్రామంలో నివాసం ఉంటున్న బాబయ్య తన తమ్ముడు బాబాఫకృద్దీన్‌ను సుత్తితో కొట్టి హతమార్చిన సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు..రాయలాపురం గ్రామానికి చెందిన బాబయ్యకు మతిస్థిమితం లేక తిక్కతిక్కగా మాట్లాడుతూ మద్యం సేవించేవాడు. గురువారం రాత్రి అన్నాతమ్ముడి మధ్య మద్యం తాగే విషయంలో ఘర్షణ పడ్డారు. దీంతో శుక్రవారం ఉదయం 9గంటల ప్రాంతంలో మంచం మీద నిద్రిస్తున్న బాబా ఫకృద్దీన్ గొడవపడి కోపంతో సుత్తితో తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. బాబాఫకృద్దీన్‌ను ఆసుపత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-వేంపల్లె : పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని పాపాఘ్ని నది సమీపంలో జూదం ఆడుతున్న వారిపై ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. జూదరులను అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

వినాయక ఉత్సవ కమిటీలో బయటపడ్డ పాత కక్షలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని వేంపల్లి రోడ్డులో వినాయక ఉత్సవ కమిటీల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు పాతకక్షలే కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. వేంపల్లి రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, మరో విగ్రహాన్ని పుష్పగిరి మాన్యంలోని వడ్డెర కాలనీలో ఏర్పాటు చేశారు. వడ్డెర కాలనీలో ఉన్న 12 మంది వ్యక్తులు విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న వినా యక విగ్రహ ఉత్సవ కమిటీకి చెందిన మధుసూదన్‌రెడ్డి, తులసిరాంపై దుర్భాష లాడి, విచక్షణారహితంగా దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయ పడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.


గాయపడిన కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, తులసిరాం

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

రోడ్డుపై తొలగించని మట్టి - నాసిరకంగా పనులు


రోడ్డుపై పేరుకుపోయిన మట్టి

ప్రజశక్తి - ముద్దనూరు

విద్యుత్ తీగల వల్ల విద్యార్థులు, రైతులు, పశువులు విద్యు దాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నా కాసులే లక్ష్యంగా కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ నుండి కడప బైపాస్ రోడ్డు వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చింది. ఆ మేరకు ముద్దనూరుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకుని నాసిరకంగా చేసి చేతు లు దులుపుకొన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం గుంతలు తీసిన మట్టిని రోడ్డుపై తొలగించకుండా అలాగే వదిలేశారు. వర్షానికి మట్టి రోడ్డుపై చేరుకుని బురదగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాల వద్ద ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లకు కనీసం టేప్ కూడా వేయకపోవడంతో వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేసి బిల్లులు దండుకున్నారు. పొరపాటున ఎవరైనా విద్యుత్తు వైర్లు తగిలితే విద్యుదాఘాతంతో ప్రాణాలు గాల్లో కలిసి పోవడం ఖాయమని బాటసారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రజలు హడలిపోతున్నారు. ఈ రోడ్డు పక్కన బిసి సంక్షేమ బాలుర వసతి గృహం, ఉన్నత పాఠశాల, కళాశాల, ఓ ప్రయివేటు పాఠశాల ఉంది. విద్యార్థులు, ప్రయాణికులు, బాటసారులు, వాకర్లు, వాహనదారులు ఈ దారిలో నిత్యం తిరుగుతుంటారు. విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోకముందే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. నాసిరకం పనులు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


స్తంభం వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి


సల్మాన్ అహమ్మద్‌కు బ్యాగ్ అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన విద్యార్థులకు బ్యాగులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులదే ప్రధాన పాత్ర అన్నారు. కాబట్టి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. ముస్లిం మైనార్టీల చిరకాల కోరిక ఉర్దూ కళాశాల అని, ఎక్కడ లేని విధంగా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో కళాశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కళాశాలలో ఉన్న చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ల్యాబ్ పరికరాల ఏర్పాటు కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ రవి, ఆర్ఐఒ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఉర్దూ కళాశాలలో ప్రస్తుతం 120 మంది అడ్మిషన్లు పొందారని, వచ్చే ఏడాది ఆ సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ఉర్దూ కళాశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు, సర్టిఫికెట్లు ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ జివి రమణ, టిడిపి నాయకులు ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, నాగభూషణం, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ, ఆర్థిక సాయం

చక్రాయపేట : గత నెల 26న గువ్వల చెరువు ఘాటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చక్రాయపేట గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ షరీఫ్ కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన సొంత నిధులు రూ.50 వేలు అందజేశారు. మృతిచెందిన మహబూబ్ షరీఫ్‌కు ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలున్నారని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. తల్లికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి నాయకుడు క్రిష్ణగిరి రమేష్, కడప జిల్లా పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, ముస్లిం మత పెద్దలు, టిడిపి కార్యకర్తలు గంగిరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శివానందరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉద్యోగ రిజర్వేషన్లు

క్రీడాకారులు భారతదేశాన్ని పరిపూర్ణ దేశంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ, ఆర్‌జెడి రవి, ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య, స్కూల్ గేమ్స్ ఆర్గనైజర్ సెక్రెటరీ అండర్-19 స్పోర్ట్స్ సెక్రెటరీ శారద, జిల్లా క్రీడా జూనియర్ కాలేజీస్ గేమ్స్ అండర్ స్పోర్ట్స్ విజయప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడా పోటీలు కూడా ముఖ్యమన్నారు. క్రీడా పోటీల్లో జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి, జాతీయస్థాయికి ప్రతిభ పురస్కారాలు అందుకున్న వారికి ఉద్యోగరీత్యా రిజర్వేషన్లు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు క్రీడా పోటీల్లో పాల్గొనడాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లా స్థాయిలో పలు ఆటలు ప్రారంభించారు. జిల్లాలోని కేజీబీవీ అట్లూరు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, ఏపీ ఎంఎస్ సంబేపల్లి, జడ్పీహెచ్ఎస్ స్కూల్ మైదుకూరు, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ గండి, పీవీఎస్ఆర్ఎమ్ కమలాపురం, జడ్పీహెచ్ టంగుటూరు, ఏపీ ఎమ్మెస్ సంబేపల్లి విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ ఎల్లారెడ్డి, చక్రాయపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా, ఎంఇ- 2 రవికుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామయ్య, వైస్ చైర్మన్, మాజీ స్టేట్ సీఈఓ రామచంద్రారెడ్డి, రిటైర్డ్ పీడీ సుబ్బరాయుడు, ఆర్కే వ్యాలీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, జిల్లాలోని పలు పాఠశాలలో పాల్గొన్న పిఈటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

విభిన్న ప్రతిభావంతులకు భరోసా


వెంకట్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విభిన్న ప్రతిభా వంతులకు బతుకు భరోసా కల్పించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. స్థానిక కళ్యాణమండపంలో శుక్రవారం వెంకట్ ఫౌండేషన్ సెలెబ్రేషన్స్ నిర్వహించారు. జన్మత పూర్తి అంగవైకల్యుడైన వెంకట్ అమ్మ విశాలాక్షి తన కుమారుడిని పలు విద్యలలో నిష్ణాతుడిగా తీర్చిదిద్ది రాష్ట్రపతి అవార్డు పొందేలా చేసిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. తన బిడ్డతోపాటు ఇలాంటి పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చే సంకల్పంతో విశాలాక్షి వెంకట్ ఫౌండషన్ ఏర్పాటు చేశారు. ఈ సెలెబ్రేషన్స్‌కు ముఖ్యఅతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ విశాలాక్షి సడలని పట్టుదల, అపార నమ్మకంతో తన బిడ్డను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. విభిన్న ప్రతిభావంతుల పిల్లల తల్లులు విశాలాక్షిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇలాంటి పిల్లలకు కూడా ఆర్థిక భరోసా కల్పించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ వెంకట్‌ను తాను బాల్యం నుండి చూస్తున్నానని, వెంకట్‌ను మాణిక్యంలా తయారు చేసేందుకు అమ్మ విశాలాక్షి ప్రయత్నం మాటల్లో చెప్పలేనిదన్నారు. ఆ అమ్మ కష్టానికి ఫలితం దక్కిందన్నారు. విశాలాక్షి ప్రయత్నం వెనుక వెంకట్ తండ్రి ప్రోత్సాహం ఎనలేనిదన్నారు. విశాలాక్షి మాట్లాడుతూ ఇలాంటి పిల్లల నైపుణ్యం ప్రదర్శనకు తాను ఈ వేదిక తయారు చేశానని, జిల్లాలో జరిగే ఉత్సవాల్లో కూడా వీరి ప్రదర్శనను ఏర్పాటు చేసి పదిమందికి తెలిసేలా పెద్దలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని 36 మండలాల భవిత కేంద్రాల విద్యార్థులు, వారికి శిక్షణనిచ్చే ఐఇఆర్‌టి పాల్గొన్నారు.

ఐకార్ పీజీ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


చంద్రశేఖర్ రెడ్డి
5వ ర్యాంకు


అబ్దుల్ కలాం
92వ ర్యాంకు

ఈ ఏడాది 2024 తమ కళాశాల విద్యార్థులు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిర్వహించిన పీజీ (ఎఐఈఈఎ) పరీ క్షలో ఉత్తమ ర్యాంకులు సాధించారని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది ఐకార్ ప్రకటించిన ఫలితాల్లో కళాశాలకు చెందిన సాయి చంద్ర శేఖరరెడ్డి అనే విద్యార్థికి ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో దేశవ్యాప్తంగా 5వ ర్యాంకు, అబ్దుల్ కలామ్ అనే విద్యార్థి ఓబీసీ కేటగిరీలో 92వ ర్యాంకు సాధిం చారని తెలిపారు. తద్వారా పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళా శాలకు, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. రాబోయే సంవత్సరంలో పోటీ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు కళాశాల విద్యార్థులు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యా ర్థులను, కళాశాల అధ్యాపకులను అసోసియేట్ డీన్ ప్రత్యేకంగా అభినందించారు.

కెజిబివిలో అన్నదానం

ప్రజాశక్తి - వేముల


మండలంలోని బచ్చయ్యగారిపల్లికు చెందిన వేముల మాజీ సర్పంచ్ చల్లా పెద్ద వెంకటయ్య మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు ఎంపీపీ చల్లా వెంకట నారాయణ గంగాదేవి, శ్రీనివాసులు కెజిబివిలో శుక్రవారం విద్యార్థులకు అన్నదానం చేశారు. ముందుగా వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి, రాష్ట్ర పిసిబి సభ్యులు మరక శివ కృష్ణారెడ్డి, కుటుంబసభ్యులు పెద్ద వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు చల్లా సుదర్శన్ బాబు, శివరామ కృష్ణయ్య, సునీల్ కుమార్, అరుణ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు మండి మాపీరా, సుబ్బారెడ్డి, నాగభూషణం, నగేష్, రాములయ్య, శ్రీధర్, రమేష్, రాఘవ, చిన్న, రాజా, మునిరెడ్డి, నాగేంద్రరెడ్డి, ఇమ్రాన్, బాదుల్లా, సర్పంచ్ నాగప్ప, సహదేవ, ప్రిన్సిపల్ శారద, భార్గవి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

వేంపల్లె : ట్రిపుల్‌ఐటిలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యాంటి సూసైడ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్య అనేది చట్ట వ్యతిరేకమైన చర్య అన్నారు. ప్రతి విద్యార్థి చిన్న విషయాలను కూడా పెద్దగా భావించవద్దని సూచించారు. సమస్యను పరిష్కారించుకోవాలే తప్ప, కుంగి పోరాదన్నారు. చిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల తల్లిదండ్రులు క్షోభపడతారని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, డీన్ అకాడమిక్ రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మధుసూదన్, ప్రోగ్రాం ఆఫీసర్లు తిరుపతిరెడ్డి, గోవర్ధన్, విశ్వనాథ్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛభారత్ : ఎంపిడిఒ

చాపాడు : స్వచ్ఛభారత్ కార్యక్రమంపై గ్రామాలలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 1 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ దివాస్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామాలలో స్వచ్ఛత హై సేవ కార్యక్రమం నిర్వహి స్తున్నామన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, చెత్త లేకుండా అవగాహన కల్పిస్తామన్నారు.


పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాబోవు ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ ఐక్యంగా కలిసి పని చేయాలని ఎపిపిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పిలుపునిచ్చారు. పిసిసి చీఫ్ షర్మిల విడుదల చేసిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో ముఖ్య అధికారి ప్రతినిధిగా తులసిరెడ్డిని నియమించడంతో వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముఖ్య అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఎఐసిసి ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్‌కు తులసిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను తులసిరెడ్డి ఎత్తి చూపారన్నారు. షర్మిల నేతృత్వంలో తులసిరెడ్డి మార్గ దర్శకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామనితెలిపారు. సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వెంకటేష్, నాగరాజు, వేమయ్య, ఆరిశేర్ల సుబ్బరాయుడు, రవి, మహబూబ్ బాషా, మదార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి నర్సుల సమస్యలు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు కోరారు. శుక్రవారం వేంపల్లెలో ఉన్న అధికార ప్రతినిధి తులసిరెడ్డిని స్టాఫ్ నర్సులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 15ఏళ్లుగా ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్నా ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 115ను రద్దు చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడాలని అభ్యర్థించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - మైదుకూరు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మైదుకూరు పట్టణ ఎస్ఐ ఘన మదిలేటి కోరారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మాదకద్రవ్యాలు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక విఆర్ జూనియర్ కాలేజీలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ మాట్లాడుతూ యువత ఎక్కువగా సరదాల కోసం మత్తు పదార్థాలైన సిగరెట్లు, ఆల్కహాల్, గంజాయి వంటి వాటికి అలవాటు పడి తాము సాధించాల్సిన జీవిత లక్ష్యాలను కోల్పోతారని తెలిపారు. మత్తు పదార్థాలు తీసుకున్న సమయంలో విచక్షణను కోల్పోయి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి చివరకు కటకటాల పాలవుతారని పేర్కొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారు అరోగ్య, ఆర్థిక సమస్యలతోపాటు సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో జెవివి జిల్లా సాంస్కృతిక కన్వీనర్ ఖాజా హుస్సేన్, అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్దాడం శివ శంకర్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు వేములూరి మాల కొండయ్య ఆచారి, శ్రీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ సాయి కిరణ్ రాజ్, సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ వెంకట్రాముడు, ప్రిన్సిపల్ తిరుమలయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బచ్చు సావిత్రమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



స్థానిక బుల్లా వీరప్ప వీధికి చెందిన బచ్చు సావిత్రమ్మ (93) గురువారం రాత్రి హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుమారులు సుభాష్ చంద్రబోష్, సుధీర్, అల్లుడు సుదర్శన్, కుమార్తెలు సుశీలమ్మ, సువర్ణ నేత్ర దానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. వెంటనే హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి వారు కార్నియాలను సేకరించినట్లు సేవాసమితి అధ్యక్షులు రాజు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు వయసు పరిమితంలేదన్నారు. మరణించిన ప్రతి ఒక్కరు ఎవరైనా నేత్రదానం చేయవచ్చు అన్నారు. నేత్రదానం చేయదలచిన వారు 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని అంబకపల్లి రోడ్డు సబ్‌స్టేషన్ పరిధి లో మరమ్మతులు జరుగుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అంబకపల్లి రోడ్డు, పాల్ రెడ్డి ఫంక్షన్ హాల్, బైపాస్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ జగదీ శ్వరరెడ్డి తెలిపారు. జెండా మానువీధి, శ్రీనివాస హాల్ రోడ్డు, పుల్లారెడ్డి హాస్పి టల్, సిఎస్ఐ చర్చ్, సబ్‌జైల్, పులిమెల్ల రోడ్డు, అహోబిలపురం ప్రాంతాల్లో కూడా సంఫరా ఉండదని తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

వేముల : మండలంలోని 33 కేవీ పెర్నపాడు ఫీడర్ మరమత్తులు చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్న 12 గంటల వరకు వేముల, పెద్దజుటూరు, పెర్నపాడు, గొల్లల గూడూరు, కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా ఉండదని జెఇ దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని బాకరాపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రశాంతి నగర్, బాకరాపురం, జండమాన్ వీధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే సందర్భంగా దోమల నివారణ నిమిత్తం సైఫోనోత్రిన్ పిచికారి చేసి, ఇంటిం టా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి ప్రజలకు దోమకాట వల్ల వచ్చే వ్యాధుల గురించి వైద్యాధికారి డాక్టర్ శాంత కుమార్ అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ నీరు నిల్వ ఉంచిన తొట్లు, ఇతర పాత్రలు మూసి ఉంచాలన్నారు. ఇంట్లో ఉన్న నీటి కొళాయిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కల్పన, సోమేశ్వరీ, శుభాహన్ బీ, ఆశా కార్యకర్త నాగమణి, సావిత్రి, హుసేన్ బీ, మాధవి పాల్గొన్నారు.